క్లుప్తంగా

శివాలయంలో ఘనంగా పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణం లోని శ్రీభుజంగేశ్వర ఆలయంలో సోమవారం ఆలయ చైర్మన్ పోకల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం జరిగిన రుద్రాభిషేకంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పల్లకీలో ఊరేగిన భద్రకాళీ సమేతుడు

రాయచోటిటౌన్ : రాయచోటిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అందంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు కూడా అభిషేకాలు, పూజలు నిర్వహించి రంగురంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాఢవీధులలో ఊరేగించారు. ఈ పల్లకీ సేవ ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.

అనుమానాస్పద స్థితిలోవ్యక్తి మృతి

పుల్లంపేట : పుల్లంపేట ఎస్‌బీవీడీ సభా మైదానంలో పల్లపు నాగార్జున అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గత కొంతకాలంగా అతను కిడ్నీ సమస్యతో బాధపడుతున్నట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న పుల్లంపేట పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

ఖాళీ పోస్టులను వెంటనే భర్తీచేయాలి

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీచేయాలని ఏఐవైఎఫ్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఏఐవైఎఫ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2లక్షల 35వేల ఉద్యోగాలను వెంటనే భర్తీచేసి, నిరుద్యోగులను ఆదుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల ముందు యిచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. నాయకులు చలపతి, అంజి, సయ్యద్‌బాషా పాల్గొన్నారు.

27వ వారం కొనసాగిన అన్నదానం

రాయచోటి అర్బన్ : రాయచోటి కలెక్టరేట్ ఆవరణంలో 27వ సోమవారం కూడా అన్నదానం కొనసాగింది. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలకు వచ్చే అర్జీదారులకు 26 వారాలుగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్న విషయం పాఠకులకు తెలిసిందే. రామాపురం స్టోన్‌క్రషర్స్ అసోసియేషన్ వారి ఆర్థిక సౌజన్యంతో అన్నదానం జరిగింది.

వలంటీర్ల సేవలు దేశానికే ఆదర్శం

లక్కిరెడ్డిపల్లి : గ్రామ, వార్డు వలంటీర్ల సేవలు దేశానికే ఆదర్శమని, అలాంటి వారిపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖలు అర్థరహితమని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, జెడ్పీటీసీ రమాదేవి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్యలు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని స్థానిక ఎంపీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారుల ఇంటి ముంగిటకు చేర్చే విషయంలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్న విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమీర్, ఉప మండల అధ్యక్షుడు సమరసింహారెడ్డి, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, ఎంపీటీసీలు లక్ష్మీనారాయణ, జగన్ మోహన్ రెడ్డి, శంకర్ నాయుడు, సర్పంచ్‌లు రమణయ్య, గడ్డం కళ్యాణి, ప్రభాకర్ రెడ్డి, సిద్ధక నాగిరెడ్డి, కె.జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

వినయ్‌కుమార్‌కు పురస్కారం

రాయచోటిటౌన్ : రాయచోటి పట్టణానికి చెందిన వీరబల్లె వినయ్‌కుమార్ భీమవరంలోని గునుపూడి సోమరామేశ్వరస్వామి ఆలయంలో పంచలింగేశ్వర స్వామి పురస్కారం అందుకున్నట్లు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్‌ఫేర్ల నిర్వహణ వంటి కార్యక్రమాలను చేపట్టడాన్ని గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేశారన్నారు. కూచిపూడి కళాకారిణి డాక్టర్ భావన, ఆలయ చైర్మన్ విజయలక్ష్మి, ఘంటసాల పవన్‌కుమార్, ఆలయ ఈఓ సురేష్‌నాయుడుల చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్లు తెలిపారు.

నీటి సమస్య పరిష్కారం

రాజంపేట : మండలంలోని శవనంవారిపల్లె పంచాయతీలోని లక్షుంపల్లెలో తాగునీటి సమస్య పరిష్కారానికి తన సొంత నిధులతో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి బోరు వేయించారని జిల్లా ఎస్సీ సెల్ నేత దాసరి పెంచలయ్య అన్నారు. సోమవారం రూ.50వేలతో బోరు పనులను ప్రారంభించారు. ఎంపీ మిథున్‌రెడ్డి నిధుల కింద పైపు లైను , మోటారు కేటాయించి నీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా లక్షుంపల్లె గ్రామస్తులు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి కృతజ్ఞతలను తెలిపారు.

సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

ఓబులవారిపల్లె : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమ ముఖ్య లక్ష్యమని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం గోవిందంపల్లి సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అర్హతే ప్రామాణికంగా, పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. చిట్టచివరి స్థాయి వరకు అర్హులను గుర్తించి ఇంటింటికి వెళ్లి సర్వేచేసి అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలు, మాయమాటలు చెప్పి అధికారం కోసం ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబును ప్రజలు నమ్మేరోజులు పోయాయని, అధికారంలోకి వచ్చేందుకు వెయ్యి అబద్ధాలు ఆడి ప్రజలను వెన్నుపోటు పొడిచారన్నారు. టీడీపీ పాలనలో వారి పార్టీ వారికే సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజలను మోసం చేశారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారమవుతున్నాయని అన్నారు. ప్రజల ఆశీస్సులు జగన్నకు ఎల్లవేళలా ఉండాలని కోరారు. అనంతరం ఏపీ టీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందన్నారు. ప్రతి ఇంటికీ ఏదో విధంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. మిగిలిన అర్హులైన వారికి కూడా సంక్షేమ పథలను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందిస్తున్నామన్నారు. అంతకు ముందు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులుకు గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీడీఓ విజయారావు, సర్పంచ్ ధనలక్ష్మీ, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, ఎంపీటీసీ రమేష్ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రరాజు, పెంచలయ్య, సురేంద్ర, చంద్ర, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం

రైల్వేకోడూరు : పేదవాడి సంక్షేమమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కోడూరు పట్టణంలోని సచివాలయం–4 పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ మాట్లాడుతూ గడిచిన నాలుగు సంవత్సరాలలో సచివాలయం 4 పరిధిలో రూ.18కోట్ల 52లక్షలు ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందించామన్నారు. కుల,మత , పార్టీలకతీతంగా పాలన సాగిస్తున్న జగనన్న ప్రభుత్వానికి మీ అండదండలు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి, ఏపీటీడీసీ డైరెక్టర్ మండల నాగేంద్ర, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జెడ్పీటీసీ రత్నమ్మ, పట్టణ కన్వీనర్ సీహెచ్.రమేష్, డిప్యూటీ తహసీల్దార్ అమరేశ్వరి, రత్తయ్య, లక్ష్మయ్య, గణేష్, మనోజ్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

పుల్లంపేట : జగనన్న ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. సోమవారం పుల్లంపేట సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో 11రకాల సేవలను ప్రజలకు ఉచితంగా అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ముస్తాక్, సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, ఎంపీటీసీ పార్థసారథి, వైస్ ఎంపీపీ బోగా వెంకటసుబ్బమ్మ, మడగలం శ్రీనివాసులు, బీకే మణి, ఎంపీడీఓ ప్రకాశం, తహసీల్దార్ నరసింహులు, పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి జగనన్న సురక్షతో లబ్ధి

ఒంటిమిట్ట : అర్హులైన ప్రతి ఒక్కరికి జగనన్న సురక్షతో లబ్ధి చేకూరుతుందని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొత్తమాధవరం సచివాలయంలో సర్పంచ్ పన్నెల రామలక్షుమ్మ అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మంజూరైన 320 ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ గెడ్డం జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గజ్జల శ్రీనివాసులరెడ్డి, ఎంపీడీఓ రెడ్డయ్య, తహసీల్దార్ మాధవీలత, మండల అధికారులు, గ్రామ పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

గ్రామస్వరాజ్యం తీసుకొచ్చిన జగన్

రాజంపేట టౌన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని తీసుకొచ్చారని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని రెడ్డివారివీధి, రామ్‌నగర్ సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ప్రజల ముంగిటకే పాలన తీసుకొచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఒకప్పుడు చిన్న సర్టిఫికెట్ కావాలన్నా ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సిన పరిస్థితులు ఉండేవన్నారు. అయితే ఇప్పుడు వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి ప్రజలకు ఏ సర్టిఫికెట్ కావాలన్నా అందజేస్తున్నారన్నారు. ఇలాంటి అద్భుతమైన పాలన దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేదన్నారు. సమీప భవిష్యత్తులోనే మరిన్ని సంక్షే పథకాలను అందించేందుకు సీఎం ఆలోచిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరికి మేలు చేయాలన్నదే సీఎం ఆశయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, జగనన్న సురక్ష మున్సిపల్ స్పెషలాఫీసర్ముని శంకరయ్య, కాకతీయ విద్యాసంస్థల అధినేత, కౌన్సిలర్ పోలా వెంకటరమణారెడ్డి, జేసీఎస్ మున్సిపాలిటీ ఇన్‌చార్జి వడ్డే రమణ, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జెనుగు కృష్ణారావుయాదవ్, వివిధ వార్డుల కౌన్సిలర్లు మనుబోలు విజయలక్ష్మీ, తంబా సుబ్రమణ్యం, విష్ణువర్దన్‌నాయక్, న్యామతుల్లా తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మేడా

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం మంజూరు చేయాలి

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీ పరిధిలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం మంజూరు చేయాలని స్థానికులు సోమవారం తహసీల్దార్ లక్ష్మిదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భగా వినోద్, వంశీ మాట్లాడుతూ మాధవరం–1 గ్రామ పంచాయతీ సచివాలయం–2 ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో విగ్రహ ఏర్పాటుకు కొంత స్థలం కేటాయించాలని కోరారు.

కాలభైరవ ఆలయానికి దారి ఏర్పాటు

రాయచోటిటౌన్ : యండపల్లె సమీపంలో గుట్టపై వెలసిన శ్రీ కాలభైరవుడి ఆలయానికి దారి ఏర్పాటు చేశారు. సోమవారం రాయచోటి మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో దాతల సహకారంతో సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. సివిల్ సప్లై డైరెక్టర్, పల్లపు రమేష్, సురవరం వెంకటసుబ్బారెడ్డి, హరినాథరెడ్డి పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి

వీరబల్లె (రాయచోటిటౌన్) : సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వీరబల్లె ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం గుర్రప్పగారిపల్లెలోని కోనేటివాండ్ల పల్లెలో సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరామరాజు, శ్రీరాములరెడ్డి పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రాజంపేట రూరల్ : వాతావరణంలో సంభవించే మార్పుల వల్ల పశువులు సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదముందని పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకుడు డాక్టర్ కె.ప్రతాప్ తెలిపారు. మందరం రాచపల్లె గ్రామంలో సోమవారం పశువిజ్ఞాన బడి నిర్వహించారు. వివిధ రకాల పశుగ్రాసాల సాగు వివరాలను వివరించారు. అత్తిరాల పశువైద్యాధికారి కె.భాగ్యమతి, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ఎం.వరదయ్య తదితరులపాల్గొన్నారు.

ఆదర్శం, పారదర్శకంగా జగన్ పాలన

సంబేపల్లె : ఆదర్శంగా, పారదర్శకంగా ముఖ్యమంత్రి జగన్ పాలన సాగుతోందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం దేవపట్ల గ్రామంలోని బుడ్డారెడ్డిగారిపల్లె, గంగన్నగారిపల్లె, దేవపట్ల కస్బా, వైఎస్‌ఆర్ నగర్, వంకవార హరిజనవాడ, నడిమిరాజువారిపల్లె, ఎగువరాజువారిపల్లె, ఆర్.వడ్డిపల్లెలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగన్ పాలన సాగుతోందన్నారు. మహిళలకు ప్రతి అంశంలోను పెద్దపీట వేస్తున్నారని, 50 శాతం మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం సీఎం జగన్‌కే సాధ్యమన్నారు. ప్రతి ఇంటా ఘన స్వాగతాలు, ఆత్మీయ ఆదరణ, ఆప్యాయతతో కూడిన పలకరింపులతో ఈ కార్యక్రమం రాత్రి 10 గంటల వరకు సాగింది. మాజీ డీసీఎంఎస్ చైర్మన్ విష్ణువర్దన్‌రెడ్డి, ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, ఆవుల మల్లికార్జునరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథ్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వడ్డి వెంకటరమణారెడ్డి, సేట్ వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ మహేశ్వరిబాయి, ఎంపీడీఓ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



దేవపట్ల గ్రామంలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

క్రికెట్ స్టేడియంను అందుబాటులోకి తీసుకొస్తాం

సంబేపల్లె : రాయచోటి పట్టణ సమీపంలోని నక్కావాండ్లపల్లె వద్ద నిర్మితమవుతున్న క్రికెట్ స్టేడియం పనులను త్వరగా పూర్తి చేయించి అన్ని హంగులతో స్టేడియంను అందుబాటులోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మోటకట్ల గ్రామం వంగిమల్లవాండ్లపల్లెలో సర్పంచ్ రాధిక, వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ పోటీలు సోమవారం ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఫైనల్ మ్యాచ్‌ను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్దన్‌రెడ్డి తిలకించారు. తొలుత వారు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని తెలిపారు. క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. కాగా ఈ పోటీల్లో సురేష్ కెప్టెన్సీలో మోటకట్ల టీం విన్నర్స్‌గా, ఈశ్వర్‌రెడ్డి కెప్టెన్సీలో చిన్నమండెం టీం రన్నర్స్‌గా నిలిచాయి.



క్రీడాకారులతో శ్రీకాంత్‌రెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక విద్య

రాజంపేట : కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక విద్యను అమలు చేస్తున్నారని ఉప విద్యాశాఖాధికారి వరలక్ష్మి తెలిపారు. ఏఐటీఎస్‌లో రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల పరిధిలోని తొమ్మిది మండలాల ఉపాధ్యాయులకు ఐఎఫ్‌ఎపీ స్మార్ట్ బోర్డులలో తరగతి గదుల్లో విద్యార్థులకు ఏ విధంగా సాంకేతికవిద్యను అందించాలనే అంశంపై ప్రత్యేక శిక్షణా సదస్సును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా వీక్షణతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం లక్షలాది రూపాయలు వ్యయం చేసి ప్రతి పాఠశాలకు ఐఎఫ్‌పీల ప్యానెల్ బోర్డులను మంజూరు చేసిందన్నారు. ఈ శిక్షణ తరగతులను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ సమాజానికి ఉపాధ్యాయులే మూల స్తంభాలన్నారు. ప్రిన్సిపాల్ నారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు రామరాజు, సుబ్బరాయుడు, కోర్స్ ఆర్గనైజర్లు సుబ్రమణ్యంరాజు, ఆదినారాయణరెడ్డి, డీఎస్‌ఓ సుధాకర్, ఏఎస్‌ఓ నాగేందర్‌రెడ్డి, రాష్ట్ర పరిశీలకుడు రెహమాన్, హెచ్‌ఓడీ సుబ్బారావుతో పాటు రాజంపేట, నందలూరు, పెనగలూరు, చిట్వేలి, రైల్వేకోడూరు, వీరబల్లి మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అటవీ సంపద పరిరక్షణ అందరి బాధ్యత

సిద్దవటం : అటవీ సంపద అయిన ఎర్రచందనం తరలి పోకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని రేంజర్ కళావతి తెలిపారు. సిద్దవటం రేంజిలోని పంచలింగాలు, శ్రీ నిత్యపూజస్వామి కోన అటవీ ప్రాంతాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరిస్తున్నట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఆలయ సిబ్బందికి సూచించారు. పంచలింగాల వద్ద వన్యప్రాణులను దృష్టిలో పెట్టుకొని అపరిశుభ్రత లేకుండా చూడాలన్నారు. అనంతరం ఆలయ అర్చకులు సుబ్రమణ్యంశర్మ, చైర్మన్ కొండారెడ్డి ఆలయ సంప్రదాయాలతో రేంజర్‌కు స్వాగతం పలికారు. భక్తుల సౌకర్యాలపై అమె ఆలయ చైర్మన్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేసు, బీటు అధికారులు, ఏబీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీనిత్యపూజ స్వామి కోన అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రేంజర్ కళావతి

సిద్దవటం జెడ్పీ హైస్కూల్ ఆకస్మిక తనిఖీ

సిద్దవటం: మండల కేంద్రమైన సిద్దవటంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. ఐదో తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చెత్తా చెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

జేవీకే కిట్టుకు సంబంధించిన బ్యాగులు కాకుండా ఇతర బ్యాగులు తెచ్చుకున్న వారిని ఇంటికి పంపించాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈఓ శంకరయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెప్మా అర్బన్ మార్కెట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

రాజంపేట : పట్టణపేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అర్బన్ మార్కెట్‌ను సోమవారం రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను తీసుకొచ్చారన్నారు. బ్యాంకు లింకేజి కింద మెప్మా మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావడానికి రుణాలు కూడా ఇస్తున్నారన్నారు. బ్యాంకు లింకేజీ రుణాలను అరుణ, మహబూబ్ సుభాని, అమ్మాజీ, బాబాజీ సంఘాలకు ఒక్కో సంఘానికి రూ.20లక్షల చొప్పున రూ.60లక్షల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, కాకతీయ విద్యాసంస్థల అధినేత పోలా రమణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వడ్డే రమణ, రాజంపేట ఏరియా హాస్పిటల్ డైరెక్టర్ వడ్డే శ్రీనివాసులు, నాయులు మురళీచారి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం

పుల్లంపేట: మండల పరిధిలోని వత్తలూరు పంచాయతీలో సోమవారం ఎంపీపీ నిధులతో వత్తలూరు ఉపసర్పంచ్ ఎం.శంకర్ రెడ్డి సోమవారం సిమెంట్ రోడ్డు పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్ రెడ్డి మాట్లాడుతూ గత కొంతకాలంగా గ్రామంలో రోడ్డులేక ప్రజలు ఇబ్బంది పడుతుండటంతో ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి స్పందించి రూ.4 లక్షలు నిధులను విడుదల చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ ఈశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

తానా మహాసభలో మలిశెట్టికి సన్మానం

రాజంపేట : అమెరికాలోని ఫిలడెల్ఫియాలో జరుగుతున్న తానా(తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా) 23వ మహాసభలలో భాగంగా సోమవారం సీనియర్ జర్నలిస్టు, పత్రికా సంపాదకులు మలిశెట్టి సుబ్బరాయుడును సన్మానించారు. ఈయనతో పాటు తానా రాయలసీమ విభాగం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో రాయలసీమకు చెందిన గ్రామాల్లో స్వచ్ఛందంగా వైద్యసేవలందించిన డాక్టర్ గూడూరు సుబ్బరాయుడు నాయుడు, తానా మాజీ అధ్యక్షుడు వేమన సతీష్‌లను కూడా సన్మానించారు.

పశుగ్రాసాల సాగుపై అవగాహన

చిట్వేలి : చిట్వేలి, పెనగలూరు మండలాల్లో సోమవారం మేలుజాతి పశుగ్రాసాల సాగుపై పశుసంవర్ధకశాఖ వైద్యులు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పెనగలూరు మండలం, చక్రంపేటలో డాక్టర్ వేదవతి, చిట్వేలి మండలం నాగవరంలో డాక్టర్ తేజ, కేకేవడ్డిపల్లిలో డాక్టర్ భువన మాట్లాడుతూ మేలుజాతి పశుగ్రాసాల సాగుతో నాణ్యమైన పాలదిగుబడి పొందవచ్చన్నారు. రైతులందరూ మేలుజాతిగడ్డి రకాలను సాగు చేసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కేడీ వరప్రసాద్ పర్యవేక్షించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆర్థికంగా ఎదుగుదల

రైల్వేకోడూరు అర్బన్ : ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఆర్థికంగా ఎదుగుదల ఉంటుందని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి తెలిపారు. గత కొద్ది రోజులుగా స్థానిక డాల్ఫిన్‌డెల్ స్కూల్‌లో రైతులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న షెడ్యూల్డు కులాల రైతులు దీని ద్వారా ఆర్థికంగా ఎదిగి వ్యవస్థాపకులుగా మారాలన్నారు. ఈ కార్యక్రమంలో మాల కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, జెడ్పీటీసీ రత్నమ్మ, శిక్షకులు సుమన్, అక్తర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు వేగవంతం చేయండి

రైల్వేకోడూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు వేగవంతం చేయాలని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల విద్యాశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టి నాటి నుంచి విద్యా, వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించి ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, ఎంపీడీఓ జాషువా, ఎంఈఓలు రామయ్య, చంద్రశేఖర్‌రాజు, రెడ్డయ్య, ఈశ్వరయ్య, కోదండ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

రాయచోటి అర్బన్ : వలంటీర్లపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు చేయడం తగదని, వెంటనే వలంటీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా పేర్కొన్నారు. తమపై పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం సాయంత్రం పట్టణానికి చెందిన వలంటీర్లు నిరసన ప్రదర్శన చేశారు. ఒకే దిష్టిబొమ్మకు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల ఫొటోలను తగిలించి దహనం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు జనాదరణ లేనందువల్లనే ప్రభుత్వంపై, వలంటీర్లపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. పవన్‌కల్యాణ్, లోకేష్‌ల యాత్రలను ప్రజలు కామెడీ షోలుగా భావిస్తుండడంతో వారికి ఏం చేయాలో దిక్కుతోచడం లేదన్నారు. పవన్‌కల్యాణ్ వ్యాఖ్యల వెనుక చంద్రబాబు హస్తం ఉందన్నారు. వీరిద్దరూ ఇష్టారాజ్యంగా ఇలాగే మాట్లాడుకుంటూ పోతే 2024లో ఆ రెండు పార్టీలు భూస్థాపితం కాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుగవాసి శ్యామ్‌కుమార్, ఫయాజ్ అహమ్మద్, దేవేంద్ర, జావీద్, ఆసిఫ్‌అలీఖాన్, షబ్బీర్, గౌస్‌ఖాన్, అల్తాఫ్, అయ్యవారురెడ్డి, సుగవాసి ఈశ్వర్, పెద్ద ఎత్తున వలంటీర్లు పాల్గొన్నారు.



బస్టాండు సర్కిల్‌లో పవన్‌కల్యాణ్, చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

పెనగలూరు : ఈనెల 18, 20 తేదీలలో జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ శ్రీధర్‌రావు, ఎంపీడీఓ వరప్రసాద్ కోరారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో పెనగలూరు సచివాలయం–1, సచివాలయం–2లోని సిబ్బంది, వలంటీర్లు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లు ఈనెల 11వ తేదీ నుంచి ఇంటింటా సర్వే నిర్వహించి ఒక్కో కుటుంబంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకొని సురక్ష కార్యక్రమంలో దరఖాస్తులు ఇవ్వాలన్నారు. అవసరమైన వారికి కుల, ఆదాయ, జనన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పెనగలూరు సెక్రటరీ సుబ్బరాయుడు, సర్పంచ్‌లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీధర్ రావు

తాగునీటి సమస్యను పరిష్కరించండి

రాయచోటి అర్బన్ : దశాబ్ద కాలంగా తాము ఎదుర్కొంటున్న తీవ్ర తాగునీటి ఎద్దడిని వెంటనే పరిష్కరించాలని పాలెంగడ్డ దళితవాడ వాసులు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్‌కు విన్నవించారు. స్పందనలో భాగంగా సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో వారు జేసీని కలిశారు. గత పదేళ్లుగా తాము మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామంలో ఉన్న చేతిపంపు చెడిపోవడంతో నీటిసమస్య అధికమైందన్నారు. యుద్ధప్రాతిపదికన తాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు మర్రి సుమిత్ర, ఏఐటీయూసీ పట్టణనేత నరసింహ, పలువురు మహిళలు పాల్గొన్నారు.



తాగునీటి సమస్యను జేసీ ఫర్మాన్ అహమ్మద్‌కు వివరిస్తున్న పాలెంగడ్డ దళితులు

గర్భిణులకు మెరుగైన సేవలు అందించండి

వీరబల్లె (రాయచోటిటౌన్) : గర్భిణులకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వీరబల్లె ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి వైద్యులకు సూచించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. సీఎం వైఎస్ జగన్ పేదలకు నాణ్యమైన వైద్యం అందాలనే నాడు – నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులు అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఆస్పత్రికి వచ్చిన రోగులకు ఉచితంగా భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినయ్ బాబు, మనీషా, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి